నమస్తే తెలంగాణ

వికారాబాద్

I హైదరాబాద్, సోమవారం 10 ఫిబ్రవరి 2025 VIKARABAD




కామారెడ్డి బీసీ డిక్లరేషన్ బోగస్

బీసీ కులగణన ఓ తప్పుల తడక

బీసీల జనాభాను తగ్గించి ఓసీల జనాభాను పెంచుకున్న రేవంత్

గతంతో పోలిస్తే బీసీ జనాభాను సుమారు 22 లక్షలకు తగ్గింపు

ఓసీ జనాభా గతంతో పోలిస్తే 15 లక్షలకు పెంచుతూ లెక్కలు

కులగణనను సక్రమంగా చేయని ప్లానింగ్ డిపార్ట్‌మెంట్

బీసీల రిజర్వేషన్లను 42 శాతం పెంచుతామని మోసం చేసిన కాంగ్రెస్

# బీసీలకు కాంగ్రెస్ ధోకా..

**- బీసీ కులగణనపై బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో ఇంటర్వ్యూ**

*గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే బీసీలకు స్థానిక సంస్థల్లో 23% నుంచి 42 శాతానికి రిజర్వేషన్లను పెంచుతామని హామీనిస్తూ కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించి.. బీసీల ఓట్లను కొల్లగొట్టింది. అయితే, పవర్‌లోకి వచ్చిన తర్వాత కులగణన పేరిట బీసీల గొంతు నొక్కింది. పదేండ్ల తర్వాత కూడా తెలంగాణలో బీసీల జనాభాను లక్షల్లో తగ్గిస్తూ లెక్కలు చూపడంతో బీసీ సంఘాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. కుల గణన ఓ తప్పుల తడక అంటూ నివేదికను చించివేయడంతోపాటు రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అయితే బీసీలపై కుట్ర చేస్తూ కాంగ్రెస్ పార్టీ చేసిన కుల గణనపై బీసీ కమిషన్ మాజీ సభ్యుడు నూలి శుభప్రద్‌పటేల్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ... -వికారాబాద్, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ)*

### అసెంబ్లీలో కేవలం ప్రకటనే చేశారు..

అసెంబ్లీలో బిల్లు తెస్తారు, చట్టం చేస్తారేమోనని అనుకోగా.. కేవలం ప్రకటన మాత్రమే చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు బీసీల రిజర్వేషన్లను పెంచే ఉద్దేశమే లేదు. బీసీల ఓట్లతో గెలిచిన ఆ పార్టీ 14 నెలల కాలంలో అన్ని వర్గాలనూ మోసం చేసింది. కమిషన్ ఆధారంగా కులగణన చేయాలని బీసీ సంఘాలు ముందు నుంచే మొత్తుకోగా.. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చేపట్టారు. మొదట మార్చి 22న జీవో నంబర్ 26 ఇచ్చి దానిని పక్కన బెట్టారు. మళ్లీ ప్లానింగ్ శాఖకు అప్పగిస్తూ జీవోనంబర్ 18 ఇచ్చారు. మొదట్నుంచీ బీసీ సంఘాలు చెబుతున్నదేమంటే బీసీల జనాభా తెలంగాణలో 54 శాతానికిపైగా ఉంటుందని.. గతంలో బీసీ జనాభా 51 శాతమంటే ఒప్పుకోలేదు. ఇప్పుడు దాన్ని 46 శాతానికి తగ్గించడంతో బీసీ సంఘాలు అభ్యంతరం తెలపడంతోపాటు కులగణన నివేదికను చించివేశాయి. ఆర్.కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, చిరంజీవుల సంఘాలన్నీ కులగణనను వ్యతిరేకిస్తుండడంతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్ననే కులగణన రిపోర్ట్‌ను తగలబెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలోనే అన్యాయం జరిగిందని, బీసీల లెక్కతేలలేదని బాధపడుతుంటే ఈ రోజు పేనం నుంచి పొయ్యిలో పడినట్లుగా బీసీల పరిస్థితి తయారైంది.

### బీసీ జనాభాను 22 లక్షలకు తగ్గించిన సర్కార్..

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా మూడున్నర కోట్లు. 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 3.68 కోట్లు ఉన్నట్లు తేలింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 3.54 కోట్లుగా చెబుతున్నది. 16 లక్షల జనాభా అందుబాటులోకి రాలేదు, వలస వెళ్లారంటూ.. సమాచారం ఇచ్చేందుకు సహకరించలేదని చెబుతున్నారు. 2014లో 3.68 కోట్లు ఉన్న జనాభా పదేండ్లలో కేవలం 2,00,000 మాత్రమే పెరుగుతుందా..? అని ప్రభుత్వ లెక్కలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2014లో బీసీలు 1,85,61,856 (51 శాతం) ఉన్నారు. ఇప్పుడు 1,64,9179 (46.25 శాతం) ఉన్న ట్లు.. అంటే 21,52,677 బీసీల జనాభాను తక్కువగా చూపుతున్నారు. వాస్తవానికి జనాభా వృద్ధి రేటు 1.35 శాతంగా ఉన్నది. వృద్ధి రేటు ప్రకారం చూస్తే తెలంగాణ జనాభా 4 కోట్లు దాటాలి. ఆధార్, రేషన్ కార్డుల ప్రకారం తీసుకున్నా జనాభా 4 కోట్లు దాటాలి.. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం 3.70 కోట్లుగా చూపుతున్నది. ఎస్సీలను 1.75 లక్షలు, ముస్లింల జనాభాను 1.65 లక్షలకు తగ్గించారు. మరోవైపు ఓసీల జనాభాను మాత్రం గతంతో పోలిస్తే 15,89,955లకు పెంచింది. 2014లో ఓసీల మొత్తం జనాభా 11 శాతం కాగా, ఇప్పుడు 15.79 శాతంగా లెక్కలు చూపుతున్నది. హిందూ ఓసీలు, ముస్లిం ఓసీలు(2.48 శాతం) చూపించి మొత్తంగా ఓసీల జనాభాను 15.79 శాతానికి కాంగ్రెస్ సర్కార్ పెంచింది.

### కామారెడ్డి డిక్లరేషన్ ఓ బోగస్..

సామాజిక న్యాయమంటూ రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా తిరుగుతూ కులగణన విషయంలో అందరి కంటే ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఏ రాష్ట్రంలోనైతే తమ పార్టీ అధికారంలోకి వస్తుందో అక్కడ తాము కులగణన చేపడుతామని, జాతీయ స్థాయిలో అధికారం చేపడితే దేశవ్యాప్తంగా చేస్తామని హామీ నిచ్చారు. అందుకు అనుగుణంగానే కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను తీసుకొచ్చి కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. ఆ డిక్లరేషన్ ప్రకారం కులగణన చేపడుతామని, స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను 23 నుంచి 42 శాతానికి పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో న్యాయం జరుగాలంటే కులగణన చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని బీసీ కమిషన్ నుంచి కాంగ్రెస్ సర్కార్‌కు నివేదిక ఇచ్చాం. ఆ నివేదికను బట్టి గతేడాది ఫిబ్రవరిలో కేబినెట్‌లో ఆమోదించారు. కులగణన చేస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్న తీర్మానాన్ని అసెంబ్లీలోనూ బీఆర్‌ఎస్‌తోపాటు అన్ని పార్టీల మద్దతుతో ప్రవేశపెట్టి గతేడాది ఫిబ్రవరి 16న ఏకగ్రీవంగా ఆమోదించారు. తర్వాత దానిని ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడంతో బీసీ సంఘాల డిమాండ్ మేరకు మార్చిలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే ఒక్కరోజు ముందు జీవోనంబర్ 26ను విడుదల చేసింది. ఎన్నికల తదనంతరం మేలో కులగణనకు సంబంధించి విధి విధానాలను తయారు చేయాలని బీసీ కమిషన్‌కు ప్రభుత్వం మెమో ఇచ్చింది. దానికి సంబంధించి పీపుల్స్ కమిటీ ఫర్ క్యాస్ట్ సెన్సెస్‌తోపాటు మేధావులు, రిటైర్డ్ ప్రొఫెసర్లు, మురళీ మనోహర్, పీఎల్ విశ్వేశ్వర్, అకునూరి మురళి, పృథ్వీరాజ్ తదితరులతో బీసీ కమిషన్ సమావేశాలు నిర్వహించింది. సెంటర్ ఫర్ ఎకనామిక్ సోషల్ స్టడీస్ తదితర రీసెర్చ్ సంస్థలకు బీసీ కమిషన్ తయారు చేసిన ప్రశ్నలన్నీ పంపి సమాలోచనలు జరిపిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వానికి నివేదిక పంపగా, మూడు నెలలు పక్కనపెట్టింది. స్థానిక సంస్థల ఎన్నికలపై గతంలోనే హైకోర్టులో కేసు ఉన్నది. మూడు నెలల్లో కులగణన పూర్తి చేసి బీసీల రిజర్వేషన్‌ను నిర్ణయించాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో బీసీ కమిషన్‌కు మరోసారి జీవోనంబర్ 47ను తెచ్చి ఇప్పుడున్న బీసీ కమిషన్‌కు డెడికేటెడ్ కమిషన్‌గా బాధ్యతిచ్చి బీసీల వెనుకబాటుతనాన్ని స్థానిక సంస్థల వారీగా తీసి రికమండేషన్ చేయాలన్నారు. అది ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు కలిపి 50 శాతమని ప్రభుత్వం చెప్పింది. కొత్తగా వికాస్ కిషన్‌రావు తీర్పు(మహారాష్ట్ర), 2010లో కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా ఈ రెండు తీర్పుల్లో సుప్రీంకోర్టు స్పష్టంగా మూడు నిబంధనలను కచ్చితంగా అనుసరించాలని తీర్పునిచ్చింది. డెడికేటెడ్ కమిషన్ స్థానిక సంస్థల వారీగా అధ్యయనం చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు 50 శాతం దాటకుండా నివేదికను ప్రభుత్వానికి అందించాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశానుసారం బీసీ కమిషన్ కొన్ని జిల్లాల్లో పర్యటించింది, కానీ, బీసీ కమిషన్‌కు అధ్యయనం చేసేందుకు వీలు లేకపోవడంతో.. డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని మరోసారి ఉత్తర్వులిచ్చింది. అప్పుడు జీవో 49 ద్వారా కొత్తగా పూసాని వెంకటేశ్వర్లు డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయడంతోపాటు సంబంధిత జీవోల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని ప్రభుత్వం జీవోనంబర్లు 47, 49లలో పేర్కొన్నది. కానీ బయట మాత్రం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కట్టుకథలు చెబుతున్నారు. పదేండ్లలో కచ్చితంగా జనాభా పెరుగుతది కానీ బీసీల జనాభాను తగ్గించి ఓసీ జనాభాను పెంచుకున్నారు.

### కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం..


జనాభా లెక్కలు తీయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉన్నది. బీసీల స్థితిగతులు మారాలంటే బీసీల జనాభా ఎంత అనేది లెక్క తేలాలి. 1931 నిజాం రాజ్యంలోనే కులగణన జరిగింది. 2011లో సోషియో ఎకనామిక్ క్యాస్ట్ సెన్సెస్ అని చెప్పి అప్పటి యూపీఏ-2 ప్రభుత్వం కులగణన చేసినా వివరాలను బయటపెట్టలేదు. ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పులు ఉన్నాయని ఆపేయడంతోపాటు రిపోర్ట్‌ను అధ్యయనం చేసేందుకు కమిటీని వేయగా, రిపోర్ట్ 98.87 శాతం సరిగ్గానే ఉందని పార్లమెంట్‌కు నివేదించినా ఆ రిపోర్ట్‌ను బయటపెట్టమని కేంద్రం చెప్పేసింది. అయితే రాజ్‌నాథ్‌సింగ్ 2018లో హోంశాఖ మంత్రిగా ఉన్నప్పుడు 2021 సెన్సెస్‌లో కులగణన చేస్తామని చెప్పినా ఇప్పటివరకు జరుగలేదు. 2011 సోషియో ఎకనామిక్ క్యాస్ట్ సెన్సెస్ లెక్కలు బయటపెట్టాలని సుప్రీంకోర్టులో కేసు నడవగా.. బయటపెట్టమని సుప్రీంకోర్టుకే కేంద్రం చెప్పింది. లెక్కలు తేల్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. రాష్ట్రాలు ఏమి చేసినా సర్వేల వరకే. వాటిని సంక్షేమ పథకాల అమలు కోసమే వాడుకుంటాయి. కాంగ్రెస్ పార్టీకి అన్నీ తెలిసి కూడా బీసీలను మోసం చేసింది.

### రివ్యూ పిటిషన్ వేస్తేనే రిజర్వేషన్ల పెంపు సాధ్యం..

ప్రతి ఒక్కరి వివరాలను సేకరించి కులగణన స్పష్టంగా చేసి శాస్త్రీయ అధ్యయనం చేసి ఆ నివేదిక ఆధారంగా సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి. నిజంగానే బీసీల జనాభా చూపిస్తూ 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్ తీసివేయాలని సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి. దీంతోనే రిజర్వేషన్ల పెంపు సాధ్యమవుతుంది. కాబట్టి బీసీలంతా రానున్న ఏ ఎన్నికల్లో అయినా కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయం.

*జిల్లాలో రైతుభరోసాకు ప్రభుత్వం ఎక్కడికక్కడ తూట్లు పొడుస్తున్నది. సాగుకు యోగ్యంకాని భూములంటూ 50,200 ఎకరాలకు కోత విధించడంతో సుమారు 25 వేల మంది రైతులు ఈ పథకానికి దూరం కానున్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాలోని రైతులకు సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందేది. అయితే, రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత రైతుభరోసా సక్రమంగా ఇవ్వకపోగా.. అర్హుల సంఖ్యను కొర్రీలు పెట్టి తగ్గిస్తున్న ది. జిల్లాలో వ్యవసాయ భూములు పెద్ద ఎత్తున ప్లాట్లుగా మారాయి. ఇటీవల అధికారులు పలుమార్లు సర్వే చేసి సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించారు. అయితే శివారులో భూములను ప్లాట్లుగా మార్చినా వాటికి పాస్‌బుక్కులు వచ్చాయి. జిల్లాలోని శివారు మున్సిపాలిటీలతోపాటు షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, తుక్కుగూడ, మహేశ్వరం వంటి ప్రాంతాల్లోని పలు వెంచర్లలో అమ్ముడుపోని భూముల్లో ఆయా పంటలను సాగు చేస్తుండగా.. వాటిని సాగుకు యోగ్యం కావని భావించి అధికారులు రైతుభరోసా జాబితా నుంచి తొలగించారు. దీంతో జిల్లాలో వేలాదిమంది రైతులు రైతుభరోసాకు దూరం కానుండడంతో ప్రభుత్వంపై మండిపడుతున్నారు.*

*-రంగారెడ్డి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ)*



# 50,200 ఎకరాలకు కోత..

**సాగుకు యోగ్యం కాదంటూ తొలగించిన అధికారులు**

**రంగారెడ్డి జిల్లాలో రైతు భరోసా అందేది 7,29,800 ఎకరాలకు మాత్రమే**

**దాదాపుగా 25,000 మంది రైతులు ఈ పథకానికి దూరం**

**కొర్రీలు పెట్టి అర్హుల తగ్గింపు**

**రేవంత్ సర్కార్‌పై మండిపడుతున్న అన్నదాతలు**

**కేసీఆర్ హయాంలో 7,80,000 ఎకరాలకు రైతుబంధు.**

**సీజన్‌కు ముందే ఠంచన్‌గా అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ**

### బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 7.80 లక్షల సాగు భూములు..


జిల్లాలో గత బీఆర్‌ఎస్ హయాంలో 7,80,000 ఎకరాలను సాగు భూములుగా గుర్తించి వాటికి రైతుబంధు అందేది. దీంతో 3,20,000 మంది కి లబ్ధి చేకూరేది. అయితే, రేవంత్ సర్కార్ సాగుకు యోగ్యంకాని భూములంటూ 50,200 ఎకరాలకు కోత విధిస్తుండడంతో 7,29,800 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా అందనున్నది.

### సాగుకు సాయమేది..

జిల్లాలో రైతుభరోసా కోసం ప్రభుత్వం వడపోత అనంతరం అర్హులుగా గుర్తించిన రైతులకు కూడా సకాలంలో పెట్టుబడి సాయాన్ని అందించడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సీజన్ పూర్తి కావస్తున్నప్పటికీ రైతుభరోసా అందక పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు మధ్యదళారులు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి వచ్చిందని మండిపడుతున్నారు.

### కేసీఆర్ హయాంలో సకాలంలో రైతుబంధు..

గత కేసీఆర్ హయాంలో పెట్టుబడి సాయం పంటల సాగుకు ముందే ఠంచన్‌గా అందేది. దీంతో అన్నదాతలు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పంటలను సాగు చేసుకునేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయాన్ని వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినవారు కూడా తెలంగాణ ఏర్పడి, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వగ్రామాలకు తిరిగి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ ఆనందంగా జీవించారు. కాగా, ప్రస్తుతం పెట్టుబడి సాయం సకాలంలో అందకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



### అర్హులందరికీ అందించాలి



గత కేసీఆర్ ప్రభుత్వం అందించిన మాదిరిగానే అర్హులందరికీ కాంగ్రెస్ సర్కార్ కూడా రైతుభరోసా అందించి ఆదుకోవాలి. గతంలో సకాలంలో పెట్టుబడి సాయం రావడంతో అన్నదాతలు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పంటలను సాగు చేసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెట్టుబడి సాయం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దళారులను ఆశ్రయించి అప్పులు చేసి పంటలను సాగు చేస్తున్నారు.

-మొద్దు అంజిరెడ్డి, ఉత్తమరైతు




# పెండింగ్ బిల్లులు ఎవరిస్తారు?

- మున్సిపాలిటీలో విలీనమైన 5 గ్రామపంచాయతీల్లో రూ.కోటికిపైగానే బిల్లుల పెండింగ్
- చేసిన పనులకు ఎంబీ రికార్డు కావాల్సినవి మరిన్ని..
- అధికారులు స్పష్టత ఇవ్వాలంటున్న మాజీ సర్పంచ్‌లు

పరిగి, ఫిబ్రవరి 9 : పరిగి మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన ఐదు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను ఎవరు ఇస్తారో తెలుపాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉన్నదని మాజీ సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు. ఐదేండ్లపాటు గ్రామపంచాయతీ సర్పంచ్‌లుగా పని చేసిన తాము పల్లెల అభివృద్ధి కోసం అప్పులు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో పరిగి మున్సిపాలిటీ ఏర్పడగా ఐదేండ్ల పదవీ కాలం పూర్తైన తర్వాత జనవరి 28వ తేదీన ఐదు కిలోమీటర్ల పరిధిలోని ఆరు గ్రామాలను పరిగి మున్సిపాలిటీలో విలీనం చేస్తూ కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా నస్కల్, శాఖాపూర్, రుక్కుంపల్లి, సుల్తాన్‌పూర్, నజీరాబాద్, సయ్యద్‌మల్కాపూర్‌లు పరిగి మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. దీంతో గ్రామపంచాయతీల రికార్డులన్నీ మున్సిపాలిటీ వారు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు అక్కడ గ్రామపంచాయతీ కార్యదర్శులుగా కొనసాగుతున్న వారు రికార్డులను మున్సిపాలిటీలకు అప్పగించాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. సంబంధిత గ్రామపంచాయతీల ఆస్తులు, బ్యాంకు డిపాజిట్‌లు, ఇతర వివరాలతోపాటు పెండింగ్ బిల్లుల వివరాలు సేకరించారు. ఇక్కడివరకు అంతా బాగానే ఉన్నది. కానీ చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి రావాల్సిన బిల్లులు ఎలా చెల్లిస్తారని మాజీ సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.

### లక్షల్లో బిల్లుల పెండింగ్..

పరిగి మున్సిపాలిటీలో ఆరు గ్రామాలు విలీనమవగా అందులో నస్కల్, రుక్కుంపల్లి, సుల్తాన్‌పూర్, నజీరాబాద్, సయ్యద్‌మల్కాపూర్ ఐదు గ్రామపంచాయతీలు ఉన్నాయి. సయ్యద్‌మల్కాపూర్ గ్రామపంచాయతీలో సుమారు రూ.45లక్షల వరకు బిల్లులు అందాల్సి ఉన్నది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు సంబంధించి మరో రూ.15లక్షలు రావాల్సి ఉన్నట్లు సమాచారం. రుక్కుంపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి రూ.30లక్షలు, సుల్తాన్‌పూర్‌లో రూ.6లక్షలు, నస్కల్‌లో రూ.5లక్షలు, నజీరాబాద్‌లో రూ.2లక్షల బిల్లులు రికార్డు చేయబడి రావాల్సినవి ఉన్నట్లు సమాచారం. వీటికితోడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నడుస్తున్న బోర్ల మరమ్మతు, వీధిదీపాల ఏర్పాటు, ఇతర చిన్న పనులకు సంబంధించి చేపట్టిన పనులకు లక్షల్లో బిల్లులు రావాల్సి ఉన్నాయి. వాటిని ఎంబీ రికార్డు సైతం చేయలేదని సమాచారం. ప్రతి మాజీ సర్పంచ్‌కు లక్షల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండగా ఐదు గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో తమ బిల్లులపై స్పష్టత ఎవరు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. అలాగే పనులు చేసి రికార్డు కాని వాటి పరిస్థితి ఏమిటని వారు వాపోతున్నారు. ప్రజల కోసం తాము పని చేశామని, గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన పనులకు ఇప్పటికీ కొన్ని రికార్డులు కాలేదని, అలాంటి వాటికి బిల్లులు ఎలా ఇస్తారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము చేపట్టిన పనులన్నింటికీ బిల్లులు ఇవ్వాలని మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### బిల్లులపై స్పష్టత ఇవ్వాలి..



గ్రామాల్లో చేపట్టిన పనుల బిల్లులపై అధికారులు స్పష్టత ఇవ్వాలి. రుక్కుంపల్లి గ్రామంలో సుమారు రూ.30 లక్షల వరకు బిల్లులు రావాలి. వీధిదీపాలు, బోర్ల మరమ్మతులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించి మరో రూ.7లక్షలు రావాలి. మా గ్రామాన్ని పరిగి మున్సిపాలిటీలో విలీనం చేశారు. బిల్లులు ఎవరు ఇస్తారనేది ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఇంకా ఎంబీ రికార్డు చేయాల్సిన వాటిని వెంటనే రికార్డు చేయించి బిల్లులు అందజేయాలి.

– ఆర్.శ్రీనివాస్, మాజీ సర్పంచ్, రుక్కుంపల్లి

# బోటు షికారు..

**కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి**



కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టుకు శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో వికారాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి తదితర జిల్లాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. దీంతో స్వచ్ఛమైన వాతావరణం, ప్రాజెక్టు అందాలను తిలకించారు. యువకులు సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఆనందంగా గడిపారు.

- వికారాబాద్, ఫిబ్రవరి 9

